క్లుప్తంగా

చైర్మన్ డీవీకి సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న కార్మికులు

ఇల్లెందు: మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఘనంగా సత్కరించారు. గురువారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు నాయిని కృష్ణ, సంజీవ్, కుమార్, వెంకన్న, భూలక్ష్మి, భారతి, ఉమ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా కార్మికులు పొందని హక్కులు సాధించుకున్నారని తెలిపారు. మున్సిపల్ కార్మికులు బెస్ట్ మున్సిపల్ శానిటేషన్ అవార్డును అందుకున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఏ ఇబ్బంది రాకుండా ఉండాలని శానిటేషన్ వస్తువులు అందజేసినట్లు చెప్పారు.

స్థానికంగానే అప్రెంటిస్‌షిప్ ఇవ్వండి..



డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా ఏ ఏరియా వారికి ఆ ఏరియాలోనే అప్రెంటిస్ ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డైరెక్టర్(పా) వెంకటేశ్వరరెడ్డిని గురువారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సంస్థలోని 11 ఏరియాలలో అప్రెంటిస్‌లను తీసుకోవటం జరిగిందని, అయితే తాజాగా యాజమాన్యం కౌన్సెలింగ్ నిర్వహించి స్థానికులను ఇతర ఏరియాలకు పంపించటం సరికాదన్నారు. వీరిలో ఓసీల ప్రభావిత ప్రాంతవాసులు, సంస్థలో పనిచేసే కార్మికులు కూడా ఉన్నారని యాజమాన్యం ఈ విషయంలో పునరాలోచించి ఎక్కడి వారికి అక్కడే అప్రెంటిస్ షిప్ కల్పించాలని కోరారు. అంతేకాకుండా వారికి ఇచ్చే స్టైఫండ్ పెంచాలన్నారు. త్యాగరాజన్, ఆల్బర్ట్, పీతాంబరం, ఎండీ రజాక్ పాల్గొన్నారు.

ఇంగ్లిష్ నైపుణ్యాలు పెంచుకోవాలి..



మాట్లాడుతున్న వెంకటరాజయ్య

సింగరేణి(కొత్తగూడెం): నేటి పోటీ ప్రపంచానికి కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరం అని ఇంగ్లిష్ రిటైర్డ్ ప్రొఫెసర్ టి.వెంకటరాజయ్య అన్నారు. గురువారం కొత్తగూడెంలోని మహిళా కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఎక్స్‌టెన్షన్ లెక్చర్ నిర్వహించారు. మాట్లాడుతూ.. కమ్యూనికేషన్ స్కిల్స్ ఇంప్రూవ్ చేసుకోవటం వలన వృత్తి పరమైన క్రమశిక్షణను అలవర్చుకోవచ్చన్నారు. వ్యక్తిత్వ వికాసం ప్రతీ ఒక్కరికి అవసరమన్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద, డాక్టర్ జి.శైలజ, కరస్పాండెంటెంట్ సునిల్‌కుమార్, అధ్యాపకురాలు మంజుల పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి..



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

సింగరేణి(కొత్తగూడెం): రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు సమస్యలను పరిష్కరించాలని నూతన వ్యవసాయ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూఏకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం అన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈరోజు డిమాండ్ డే నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని అన్నివర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నట్లు చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులకు దిక్కు తోచడం లేదన్నారు. రాము, ప్రభాకర్, కిషోర్, బానోత్ ధర్మా, బుర్రా వెంకన్న, ఈసం శంకర్, కల్పన పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: భార్యాభర్తల కలహాల కారణంగా భార్య చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం.. సోములగూడెం గ్రామానికి చెందిన ముదిగొండ గౌరి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబసభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు.

ప్రమాదకరంగా మలుపులు

- తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



కారుకొండ గుట్టల వద్ద మూలమలుపులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ పంచాయతీలోని గుట్టల మధ్య ఉన్న ఎస్ ఆకారం మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. లారీలు, ఇతర వాహనాలు ఎస్ ఆకారంలో మూలలు తిరిగే సమయంలో రోడ్డు సరిగా అర్థం కాక భారీ వాహనాలు పల్టీ కొడుతున్నాయి. రాత్రి వేళలలో మరింత ఎక్కువగా కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్ నుంచి శేషగిరినగర్ మీదుగా ఈ మూలమలుపుల వద్ద భారీ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. విజయవాడ, ఖమ్మం, కోదాడ, వైజాక్ తదితర ప్రాంతాల నుంచి వస్తున్న భారీ లారీలు, వాహనాలు పోస్టాఫీస్ గుండా వాహనాలు ఈ మూలమలుపుల మీదుగా కారుకొండ, ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాలకు వాహనాలు రాకపోకలు కొనసాగుతాయి. అంతేకాకుండా కొత్తగూడెం పట్టణం నుంచి ఇల్లెందు వైపు వెళ్లే వాహనాలు సైతం ఇదే మార్గం గుండా రాకపోకలు జరుగుతాయి. కారుకొండ గుట్టల వద్ద రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉంది. కొత్తగా వచ్చే ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడిపోతున్నారు. ఇక్కడ కనీసం వీధి దీపాలు, హెచ్చరిక బోర్డుల కూడా లేవు. వేగంగా వస్తున్న లారీలు మూలమలుపు వద్ద షడన్‌గా బ్రేక్‌లు వేయటం వల్ల అదుపు తప్పి, ఇతర వాహనాలపైకి దూసుకెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడగా ఒకరు మృతి చెందారు. ఇలా పలు ప్రమాదాలు జరిగి అనేక మంది క్షతగాత్రులై ఆస్పత్రి పాలై బతికి బయటపడ్డారు.

హెచ్చరిక బోర్డులు ఏవి?

కారుకొండ గుట్టు మధ్య ఉన్న ఎస్ ఆకారం మూలమలుపులకు రెండువైపులా వాగులు, లోలెవల్ చప్టాలు ఉన్నాయి. అయినా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఎంటువంటి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇరువైపుల స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్ల సూచికలు అమర్చలేదు. రక్షణ చర్యలు ఏర్పాటు చేయకపోవడం వలను తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

మలుపులను తొలగించాలి..

జూబ్లీపురం క్రాస్ రోడ్డు గుట్టల మధ్య ఎస్ ఆకారంలో ఉన్న మూలమలుపులు ప్రమాదాలకు దారి తీస్తోంది. ఈ రోడ్డు పక్కనే ఉన్న రైతుల భూములను కొనుగోలు చేసి రోడ్డును నిర్మాణం చేయాలి. అంత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ రెండు మలుపులను ఒక మలుపుగా చేయటం వల్ల ప్రమాదాలు తగ్గుతాయి.

మలుపులతో ప్రమాదాలు...



కారుకొండ గుట్టల మధ్య మూలమలుపుల వద్ద ఎప్పుడూ వాహనాలు పల్టీ కొడుతుంటాయి. రాత్రివేళల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు రోడ్డు అర్థం కాక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపు వద్ద వీధి దీపాలు లేవు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు.

– యేలేటి వెంకటేశ్వర్లు, హేమచంద్రపురం

కొత్తగా రోడ్డు నిర్మించాలి...



కారుకొండ గుట్టల మధ్య ఎస్ ఆకారంలో దగ్గరదగ్గరగా మలుపుల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కారుకొండ నుంచి వచ్చే రోడ్డును నేరుగా రైతుల భూముల గుండా మలిపి కొత్తగా రోడ్డు నిర్మాణం చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి. తక్షణమే ఈ రోడ్డుకు ఇరువైపుల రక్షణ బోర్డులతోపాటు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

– పురుషోత్తం, తెలగరామవరం

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి



కొత్తగూడెంఅర్బన్: మోడ్రన్ ఇక్రా పాఠశాలలో..

కొత్తగూడెంఅర్బన్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మోడ్రన్ ఇక్రా స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. భారతదేశ మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా గురువారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి రామవరం 12వ వార్డులో స్కూల్‌లో ఆడపిల్లల విద్యపై అవగాహన కల్పించారు. మహిళా టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పర్వీన్ సుల్తానా, విజయలక్ష్మి, సల్మా, అనిత, నుసరత్, లక్ష్మీప్రసన్న, నీలా, స్వర్ణలతీఫా తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మహాత్మా జ్యోతిరావు పూలే, సాయిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడిచిన మహనీయురాలు ఫాతిమా షేక్ జయంతిని గురువారం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి జేపీఆర్ ఫౌండేషన్ ట్రస్టు వ్యవస్థాపకులు ఇడుపుల రాజు, ముస్లింలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. సాయిత్రిబాయి పూలే సహోద్యోగిగా అసమానతలపై పోరాడిన ధీశాలి ఫాతిమా షేక్ అని కొనియాడారు. ఆధునిక భారతంలో తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాడుగుల నాగరాజు, షేక్ సమీర్, షేక్ సయ్యద్, శంకర్, వెంకట్, తంబర్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: సంఘ సంస్కర్త, దేశంలోని మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 192వ జయంతిని గురువారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలేజీలో మహిళా అధ్యాపకులను సన్మానించారు. బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఫాతిమా షేక్ వేషధారణలో చిన్నారులు అలరించారు.

ఆలయాల ట్రస్ట్ బోర్డులో అవకాశం ఇవ్వండి..



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: దేవాలయాల్లో ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ఉద్యమకారులకు అవకాశం ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర జిల్లా అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం గాజులరాజం బస్తీలో తొలి,మలి ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు తమకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు అయినా ఉద్యమకారులకు కనీస గుర్తింపు రాలేదన్నారు. దేవాలయాల్లోని ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న ప్రభుత్వం ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేవులపల్లి రామ్మూర్తి, సంగీతరావు, కాకెల్లి సైమన్, కిరణ్‌కుమార్, రమేష్ శ్రీనివాస్, తిరుపతయ్య, కవిత, లింగయ్య పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి స్కూళ్లను అత్యాధునిక ప్రమాణాలతో నడపాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. గురువారం ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్‌తో కలిసి పాఠశాలను విజిట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. మాట్లాడుతూ... త్వరలో సింగరేణిలో ఏర్పాటయ్యే సీబీఎస్ఈ సిలబస్‌కు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. అకడమిక్ సంవత్సరంలో గోదావరిఖనిలో ప్రవేశపెట్టిన అనంతరం కొత్తగూడెంలోని పాఠశాలలో ప్రవేశపెట్టాలన్నారు. అదేవిధంగా సత్తుపల్లిలో కార్మికుల పిల్లల అవసరాల కోసం హైస్కూల్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో సిబ్బందిని పెంచి పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..



సింగరేణి(కొత్తగూడెం): ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. జీఎం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, సంక్రాంతి పండుగ లోపే కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. 2022 సమ్మె ఒప్పందంలోని అంశాలను అమలు చేయాలన్నారు. జంగంపల్లి మోజెస్, శ్రీనివాస్, పండు, లక్ష్మణ్, రాజలింగం, భావ్‌సింగ్, తరుణ్, సురేష్, జగన్, ప్రణయ్, రాము, భువనేష్, సర్వయ్య, రవి పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జీఎం శాలేంరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచాలని, సంక్రాంతి పండుగ నేపథ్యంలో తక్షణమే వేతనాలు చెల్లించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2022లో 18 రోజులు సమ్మె చేసిన సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, మల్లికార్జున్ రావు, కత్తెర్ల రాములు, గట్టయ్య, సుధాకర్ సందెబోయిన శ్రీనివాస్, మధుకృష్ణ, పిట్టల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్ల తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్, గౌతంపూర్ ప్రాంతాలలోని సూపర్‌బజార్లను ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. మాట్లాడుతూ.. కార్మికుల సౌకర్యార్థం నాణ్యమైన వస్తువులు సరసరమైన ధరలకు అందించేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికంగా కొనుగోలు చేసే కార్మికులకు కంపెనీ క్రెడిట్ సౌకర్యం కూడా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ పోతేదార్ విలాస్ శ్రీనివాస్, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, డీజీఎం పర్సనల్ శివకేశవరావు, సీహెచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచ: రాబోయే వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల సంభవించే అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ యెడ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం సేఫ్టీ డీఈ సమయ్య ఆధ్వర్యంలో కేఎస్‌పీ క్యాంప్ కాలనీలో అగ్నిమాపక మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, నివారణ పరికరాల పనితీరు, ప్రమాదం జరిగినప్పుడు స్పందించే తీరును కాలనీ మహిళలకు అవగాహన కల్పించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ.. గృహిణులు గ్యాస్ సిలిండర్లు, స్టవ్ వినియోగించేప్పుడు జరిగే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సేఫ్టీ ఏడీఈలు నాగయ్య, శేషసాయి, ఏఈ నాగరాజు, మహేష్, మౌనిక, వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాల్వంచ: రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహదారులు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ డి.భీమ్‌సింగ్ అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా గురువారం స్థానిక బీసీఎం రోడ్డులో ట్రాలీ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్‌సింగ్ మాట్లాడుతూ.. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. పెరుగుతున్న వాహనాల దృష్ట్యా ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి..

పాల్వంచరూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. తోగ్గూడెం గ్రామంలో గురువారం సీపీఐ శాఖ మహాసభ జరిగింది. మాట్లాడుతూ.. సీపీఐకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తూ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కూనంనేని కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతీ పంచాయతీలో సీపీఐకి ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఇట్టి వెంకట్రావ్, నిమ్మల రాంబాబు, జర్పుల మోహన్, మాజీ సర్పంచ్ బి.శాంతి, బాదావత్ శ్రీను, జర్పుల బాలకృష్ణ, కిషన్, సాయిరాం, సుభాష్, లక్ష్మి, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: యువత చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన పంచాయతీ స్థాయి ఆటల పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. పట్టణాల కంటే మారుమూల గ్రామాలలోనే నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉంటారని, ఇటువంటి పోటీల ద్వారా వారిలో దాగి ఉన్న ప్రావీణం వెలుగులోకి వస్తుందన్నారు. ప్రతీ యువకుడు పోటీలలో పాల్గొని సత్తా చాటాలని సూచించారు. మత్తుకు దూరంగా ఉంటూ మంచి జీవితం, ఉజ్వల భవిష్యత్ కోసం యువత ఆరాటపడాలని, అటువంటి వారిని ప్రోత్సహించేందుకు ప్రతీఒక్కరు ముందుకొస్తారని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, చాట్ల భాగ్యమ్మ, కార్యదర్శి కృష్ణమూర్తి, పులి సైదులు, మండల రాము, పూనెం సురేందర్, తాటి భిక్షం, కుమ్సోత్ రాము, మనోహర్, సురేందర్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు ఎకో పార్క్ సిద్ధం..



ఎకో పార్క్‌లోని బటర్‌ఫ్లై గార్డెన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీ ప్రాంగణంలో సందర్శకులు వీక్షించేందుకుగాను ఎకో పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రజలు వీక్షించటానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిన్నారులు ఆడుకోవటానికి జారుడు బల్ల, ఉయ్యాల వంటి ఆటవస్తువులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పార్క్‌లో బటర్‌ఫ్లై, బయోడైవర్సిటీ పార్క్, హనీబీ కీపింగ్, బుద్ధవనం, తాళ్లవనం, బర్డ్ వాచింగ్, టవర్, వీక్షకులు సేద తీరటానికి ఒక గుడిసె కూడా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎకో పార్క్‌ను సుమారు రూ.కోటితో ఏర్పాటు చేయటం జరిగిందని దీనిని అందరూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పార్క్‌కు వచ్చేవారు జీకే ఓసీ చెక్ పోస్ట్ వద్ద గేట్ పాస్ తీసుకొని రావాలని, వెళ్లేటప్పుడు ఆ పాస్ గేట్ వద్ద ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు వెంట తేరాదని, ఎటువంటి మొక్కలను, పూలను కోయరాదని వివరించారు.

ఆందోళనలో కార్మికులు



ధర్నా చేస్తున్న సోలార్ కార్మికులు

ఇల్లెందు: సింగరేణిలో సోలార్ కార్మికులు ఆందోళన బాటపట్టారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. జీఎం వి.కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. గురువారం ఇల్లెందు సోలార్ కార్మికులు టీయూసీఐ, సీఐటీయూల ఆధ్వర్యంలో ఇల్లెందులో ర్యాలీ నిర్వహించారు. జీఎం కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన విరమించబోమని ప్రతిజ్ఞ చేసి ధర్నాకు దిగారు. టీయూసీఐ నాయకులు యాకుబ్‌షావలీ, సీఐటీయూ నాయకులు ఎస్ఏ నబీ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల తరహాలో సోలార్ కార్మికులకు జీఓ ఇచ్చి వేతనాలు విడుదల చేయాలన్నారు. లాభాల వాటా ఇవ్వాలని, గార్డులకు మూడు షిఫ్టుల డ్యూటీలు కేటాయించాలని కోరారు. మల్టీపర్సన్ విధానం రద్దు చేసి కేటగిరి విధానం అమలు చేయాలని విన్నవించారు. సోలార్ ప్లాంట్‌లో మ్యాన్ పవర్ తగ్గటం వల్ల చోరీలు జరుగుతున్నాయని, గార్డుల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, సంజీవ్, రామకృష్ణ, ప్రేమ్‌సింగ్, రాజు, శ్యాంబాబు, దల్సింగ్, గణేష్‌బాబు పాల్గొన్నారు.

‘కార్పొరేషన్’ ఆలోచన విరమించుకోవాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

కొత్తగూడెంటౌన్: గిరిజన ఆదివాసీ షెడ్యూల్డ్ ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సరైంది కాదని తక్షణమే ఆ ఆలోచనను విరమించుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, ఆదివాసీ సంఘాల ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని ట్రాన్సిస్ట్ గెస్ట్ హౌస్‌లో గిరిజన జేఏసీ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... కార్పొరేషన్ ఏర్పాటుతో గిరిజనుల హక్కులకు, చట్టాలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందన్నారు. 74వ రాజ్యాంగ సవరణ ఆర్టికల్ 243 (జెడ్‌సీ), 244(1), 244(2)ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలకు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు వర్తింపులో మినహాయింపు ఉందన్నారు. రామవరంలోని 7 వార్డులు ఏజెన్సీ ప్రాంతాల్లో ఎలా వీలినం చేస్తారని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ పేరుతో రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో ఎస్టీ నియోజకవర్గం లేకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. న్యాయం కోసం రాష్ట్ర గవర్నర్, రాష్ట్రపతిలను కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లావుడ్యా ప్రసాద్‌నాయక్, నునావత్ రాంబాబు నాయక్, శివనాయక్, వంశీనాయక్, భరత్, గోబ్రియానాయక్, శ్రీనివాస్‌నాయక్, బానోతు పూర్ణచందర్, చందర్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, లావుడ్యా రమేష్‌నాయక్, భాస్కర్‌జాదవ్, కుమార్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు



ఇల్లెందురూరల్: వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇల్లెందురూరల్: రొంపేడు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలో విద్యార్థులు అలరించారు. పాఠశాల ఆవరణలో పచ్చని పందిరి సెట్టింగ్‌లో వేడుకలను సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. హరిదాసు చుట్టూ చేరి సంక్రాంతి పాటలు పాడిఆడారు. పిండి వంటలను చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

కొత్తగూడెంటౌన్: ముగ్గుల పోటీలు మహిళలకు ఎంతో ఉత్సాహం ఇస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వేసిన ముగ్గులను జిల్లా జడ్జి పాటిల్ వసంత్ వీక్షించారు.

పర్యాటక కల నెరవేర్చుకుందాం..



చెరువు వద్ద గంగమ్మకు పూజ చేస్తున్న గ్రామస్తులు

ఇల్లెందురూరల్: సహజ సిద్ధంగా ఉన్న అందాలకు తోడు ఆధునికతతో కూడిన సౌకర్యాలను జోడించి పర్యాటక ప్రాంతంగా గ్రామాన్ని తీర్చిదిద్దేందుకు పూబెల్లి గ్రామపెద్దలు గురువారం ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. పూబెల్లి గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద కార్యదర్శి బాలకృష్ణ అధ్యక్షతన పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల ప్రజలతో గురువారం గ్రామసభ నిర్వహించారు. సెర్ప్ ఏపీఎం దుర్గారావు మాట్లాడుతూ.. గ్రామాన్ని పర్యటించిన సమయంలో కలెక్టర్ చెప్పిన మాటలు, పర్యాటక ప్రాంతంగా పూబెల్లిని తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. ఈ ప్రక్రియ అవగాహన కోసం పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకున్న బ్లాక్ బెర్రీ దీవిని ఎనిమిది మంది సభ్యులు సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. అక్కడ పర్యాటకుల కోసం సమకూర్చిన సౌకర్యాలను వివరించారు. ఇదే తరహాలో పూబెల్లిలోనూ సౌకర్యాలను సమకూర్చేందుకు ముందుగా గ్రామస్తులు ఐక్యతతో స్వచ్ఛందంగా తమ సన్నద్ధతను ప్రకటించాలని కోరారు. స్పందించిన గ్రామపెద్దలు ఐక్యంగా సహకరిస్తామని, కమిటీల వివరాలను గ్రామాల వారీగా నిర్ణయించి నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చెరువు వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజ చేశారు. సమావేశంలో సెర్ప్ సీసీ ఖమ్మంపాటి నర్సింహారావు, గ్రామపెద్దలు రామస్వామి, బక్కయ్య, మూతి ముత్యాలు, పొదుపు సంఘాల ప్రతినిధులు కృష్ణవేణి బాయమ్మ, విజయ, ఉమారాణి పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎస్. శేషయ్య - 99121 99148